# ★ సమాధానం ★

• శ్రీ డి. సూర్యం •

ఈ ప్రశాంత వాతావరణంలో నీలేఖకు సమాధానం వ్రాయాలనుకున్నా. నాభర్తకూడ నాతోనే ఉన్నారు. మా నిత్యజీవితంలో సాయంత్రం ఈ సముద్రతీరం దగ్గర కొన్నిగంటలు వ్యయం చెయ్యడం మాకు అలవాటై పోయింది.

నువ్వు చెబుతావు "నేను చాలా అందంగా ఉంటా"నని. "లోకం చెబుతుంది నేను బాగా పాడుతా"నని. మధు నాలో ఉండే ఈ రెండు గుణాల్ని చూచే స్నేహం చేశాడు. ఆనాటి స్నేహమే ఈనాడు మమ్మల నిద్దర్నీ జీవితంలో భాగస్వాములుగ జేసింది. నా వివాహం అయినపట్నినుండి నన్ను నీకు తెలుసు. అందుచేతనే చాలాసార్లు ప్రశ్నించావు. "నువ్వు గ్రుడ్డివాడిని ఎందుకు పెండ్లాడావు?" అని. ఆ ప్రశ్న నన్ను చాలా బాధ పెట్టేది. ఆ ప్రశ్నకు సమాధానం ఎన్నోసార్లు ఇవ్వాలనుకున్నా. ఇయ్యలేక పోయా. ఆ ప్రశ్న నువ్వేకాదు మధు వెనుకటి జీవితం తెలియని చాలామంది ప్రశ్నించారు. ఏఒక్కరికి సమాధానం ఇయ్యలేకపోయాను. కొన్ని కొన్ని ప్రశ్నలకు అసలు సమాధానాలుంటాయని నేను అనుకోను.

మధుతో నాకు పరిచయం అయినప్పటినుండి నాకు జీవితంమీద 'ఆశ' అనేది జనించింది. ఆ ఆశావృక్షం చిలువలు పలువలు వేసుకొని మిస మిసలాడే నిండు యౌవ్వనంలో తొణికిసలాడుతూండే తుఫాను దానిమీద కసి తీర్చుకుంది. మోడువారి జీవనంలేని వృక్షంలా మిగిలిపోయింది. ఆ వృక్షాన్ని ఏ కళాకారుడో గుర్తిస్తాడు. సామాన్య మానవునకు మోడువారిన వృక్షంలా కనబడుతుంది. అతను అలా అనుకుంటాడు.

ఈనాడు మధు ప్రపంచాన్ని చూడలేడు. కాని అతని హృదయంలో ఉండే నయనద్వయాలతో ప్రపంచాన్నే కాదు, అందలి నిగూఢ భావాల్ని కూడ అవగాహన చేసుకుంటాడు. ఈనాడు ఘోషచేసేసముద్రం ఎలా వుంటుందో అతను చూడలేడు. ఊహించి గీతాలాపన చెయ్యగలడు. ఎదురుగా కనిపించే ఆకాశం నీలంగా వుంటుందో పచ్చగా వుంటుందో తెలియదు. కాని ఒక నాడు ప్రకృతినంతా అతని గదిలో నాలుగు గోడలమధ్య బంధించాడు. ప్రకృతి యంతా పచ్చటి తివాచీలలా, ప్రజల్ని మెరిపించే వ్యక్తుల్లా అతని గదిలో పాతుకు పోయింది. బల్లమీద ఉండే ప్రతికుంచె అతని చేతిలో ఇరుక్కోవాలని ఉవ్విళ్లూరుతూండేవి. అతడు వాటన్నిటికి బానిస, సర్వాధికారి. "అతనికోసం కుంచెలు, కుంచెలకోసం అతను జీవిస్తున్నారా-" అని అనిపిస్తుంది. అతనంటూండేవాడు "రీటా! ఈ కుంచెలు నాతో మాట్లాడుతాయి"- అని. నన్ను అతను ఎన్నోరూపాల్లో చిత్రించాడు. ఆగదిలో ప్రతిమూలా దొర్లుతూ ఉండేవి. వాటిని చూస్తే నాకు కోపం, సిగ్గు, సిగ్గుతో కూడుకున్న కోపం వచ్చేవి.

"రీటా! సృష్టికర్త తన నైపుణ్యాన్నంతా ఉపయోగించి, నిన్ను సృషించాడు. లోకం నీ అందాన్ని చూసి మురిసిపోతుంది. నీ అందాన్ని చూచే నీకు దాసుడినయ్యా. ఈనాడు నా రీటాని నేను సృష్టించుకున్నా. నా రీటాల కన్నుల్లో నృత్యంచేసే అందాన్ని చూడు. రీటా! ఈ రీటాలన్నీ నావి." అని ఆ రీటా చిత్రాలన్నిటిని నాకిచ్చేశాడు.

అతని మాటలు మధురంగా మృదువుగా నిర్మలనదీ ప్రవాహంలో ప్రవహిస్తాయి. ఆ మాటలు, నన్ను, ఆ చిత్రాన్ని, నా సర్వస్వాన్నీ మరచిపోయేటట్లు చేశాయి. కవితాకన్య అతని నాలుకమీద, గజ్జెలు కట్టుకొని ఘల్లు ఘల్లున నాట్యం చేసేది.

పెళ్లికాక మునుపే మమ్మల్ని భార్యా భర్తలనుకునేవారు. నేను లేకుండా అతను ఏ 'ఒపేరా'కు వెళ్లేవాడు కాదు. నాతో చెప్పకుండ ఏపనీ చేసేవాడుకాడు.

మా ఇరువురి భావములలో ఏవిధమైన తేడా లేదు. నేను చెప్పిన ప్రతీదీ కాదనడు. కాని నన్ను 'రీటా' అని ఎందుకు పిలుస్తున్నాడో తెలిసేదికాదు. అందులో ఏదో నిగూఢమైన భావం ఉండాలి. లేకపోతే అతను అంత చులకనగ మాటలను ఉపయోగించడు. ఎన్నో సార్లు తెలుసుకోవాలని ప్రయత్నించా. "ఏం? 'రీటా' అనే పదం నిన్ను బాధ పెడుతోందా?-" అని అతనంటే తిరిగి సమాధానం చెప్పలేకపోయేదానిని. అతను ఎప్పుడూ నవ్వుతూ మాట్లాడుతాడు. ఆ నవ్వుముఖం చూస్తే అతనికి విచారమంటే ఏమిటో తెలియదని, అసలు

విచారమనే పదం లేనేలేదని అనిపిస్తూండేది నాకు. నేను రీటాగురించి ప్రస్తావన తెస్తే విచారం ఎరుగని అతని ముఖంలో విషాదరేఖలు కనబడేవి. వాటిని నేను భరించలేకపోయేదాన్ని. అవి నన్నెంతో భయపెట్టేవి. తిరిగి అతని వంక చూడలేక పోయేదాన్ని. ఏదో తప్పు చేసినట్లుగా బాధపడేదాన్ని. "అతని నాప్రశ్న ఎప్పుడూ ప్రశ్నించకూడదు" అని అనుకునేదాన్ని.

ఒకనాడు 'ఒపేరా'లో ఆంగ్లచిత్రం చూడటానికి వెళ్లాం. అలా అతనితో ఆంగ్లచిత్రాలు చూడటానికి నాకు పరిపాటైపోయింది. అతనితో చిత్రాలకి వెళ్ళడమంటే నాకెంతో ఇష్టం.

ఆచిత్రంలో కథానాయకి పేరు రీటా. ఆమె నర్తకిగా కనబడుతుంది. కారణాంతరాలవల్ల ఆమె చంపబడుతుంది. అది ఆ చిత్రంలోని ఇతివృత్తం

ఆ చిత్రం చూస్తున్నంతసేపూ నాతో ఒక్క మాటైన మాట్లాడలేదు. అతను అట్లా ఎప్పుడూ ఉండేవాడు కాదు. సినీమా పూర్తి అయిన తరువాత బాధగా లేచాడు. బీచికి వెడదా మన్నాడు. ఎదురు చెప్పలేకపోయాను.

చాలా ప్రశాంతంగా ఉంది సముద్ర తీరం. ఏదో మాట్లాడటం మొదలు పెట్టాడు. అతని ధోరణంతా పూర్తిగా మారిపోయింది. అతను నాదగ్గర ఆవిధంగా మాట్లాడటం ఇదే ప్రప్రథమం. ప్రతీమాట విచారంలో శిరస్నానంచేసి వస్తున్నట్లున్నాయి. ముఖంలో పూర్వపు కళ లేదు. అతను మధు కాదేమో అని అనిపించింది. ఎప్పుడూ ఆనందాన్నిచ్చే సముద్ర ఘోష ఆనాడు నన్ను భయపెడుతున్నట్లనిపించింది. నా మనస్సును సమాధాన పరుచుకోలేకపోయాను. పాట పాడమన్నాడు. తిరిగి ఈ ప్రపంచంలోకి వచ్చాడనుకున్నాను. పాడాను. చాలా సేపటికి "చాలా బాగుంది నీ పాట రీటా!" అన్నాడు. 'రీటా ఎవరు?' అని తిరిగి ప్రశ్నించాలనుకున్నా. ధైర్యం చాలలేకపోయింది.

"రీటా! నిన్ను రీటా అని ఎందుకు పిలుస్తానో తెలుసునా?" అన్నాడు నా సమాధానం కోసం ఎదురు చూడకుండా. అతను అలా చంద్రునికేసి చూస్తూ భారంగా "నా రీటా చనిపోయింది, ఆమె అలా చెప్పకుండా చనిపోతుందని అనుకోలేదు. ఆమెతో చేతులు కలిపి నృత్యం చేశా. ఆమె నా రీటా, ఆమెచనిపోయింది, కాని ఎవ్వరూ చంపలేదు." అన్నాడు. చంద్రకాంతిలో అతని కళ్లనుండి రాలే కన్నీళ్లు ఆణిముత్యాల్లా మెరిశాయి. "రీటా! ఆమె జ్ఞాపకార్థం నిన్నా పేరుపెట్టి పిలుస్తూంటాను. నీకాపదం బాధ కలిగిస్తుందా" అన్నాడు. నేను మాట్లాడలేకపోయా.

తరువాత తిరిగి రీటా ప్రస్తావన రాలేదు. పూర్తిగా నా పేరేమిటో మరచిపోయా.

మేము పెళ్లి చేసుకోవాలని స్థిరపరచుకున్నాం. అనాటినుండి మా జీవితం నూతన మార్గాన్ని అన్వేషించింది. అనుకోని అవాంతరం వచ్చిపడింది. అతను దారుణమైన స్ఫోటక వ్యాధికి గురి అయ్యాడు. ఆ స్ఫోటకానికి తన రెండు కళ్లూ బహూకరించుకున్నాడు. అతనేమీ బాధ పడలేదు. ఇదివరకు వలెనే నవ్వుతూ మాట్లాడుతూ ఉండేవాడు. నాకుమిగిలిందల్లా విషాదమే. మధు నన్ను చూడలేడు. నా కళ్ళని వర్ణించ లేడు. నాపెదవులపై చిరునవ్వుని నాట్యమాడించలేడు.

"రీటా! నువ్వు నిజంగా ఇదివరకులా అందంగా వున్నావా? నీ కళ్ళు నా రీటాలలా ఉన్నాయా? నా రీటాల కళ్ళు మెరస్తున్నాయా? ఆకాశం ఇదివరకులా నీలంగా ఉందా? ఇప్పుడు వెడితే సముద్రతీరం నన్ను గౌరవిస్తుందా? ఇంక నా జీవితంలో నాకుంచెల నుపయోగించలేనా? నువ్వేనా నాతో మాట్లాడుతూంట రీటా! ఇక నువ్వురావు నాదగ్గరకు. నన్ను ఒంటరివాణ్ని చేసి వెళ్ళిపోతావు. రీటా! వెళ్ళిపో, ఎక్కడికో, ఎప్పుడో, ఎక్కడో ఆనందంగా.........." అని ఇంక మాట్లాడలేకపోయాడు. ఆమాటలు నాకు బాణాల్లా గుచ్చుకున్నాయి. నా నోట మాట రాలేదు. నేను మాట్లాడ గలననే సంగతి కూడా మరచిపోయాను.

మరునాడు నేను మధుని పెండ్లాడాను. మొదట్లో వివాహ మాడటానికి నిరాకరించాడు. తరువాత అందరి మధ్య నన్ను గౌరవించాడు. చాలామంది మధు పూర్వ జీవితం తెలియనివారు మా వివాహానికి ఆశ్చర్యపోయారు. తెలుసున్నవారు ఆనందించారు. ఆనాటినుండి మే మిద్దరం జీవితంలో భాగస్వాములమయ్యాం. మధు కళ్లు లేకపోయినా బాధపడేవాడుకాడు. కాని అప్పుడప్పుడు "నేను రీటాను సృష్టించలేను. సృష్టికర్త తన కోపాన్నంతా ఈ విధంగా

(తరువాయి 32-వ పేజీలో)

న్నారు ఏ అఘాయిత్యమైనా చేస్తుందేమో అన్న భయంతో. స్త్రీ ఎవరికోసం తనసంపదలు, తన వాళ్ళను వదలిపెట్టి వచ్చిందో వాళ్ళే లేకపోతే ఇంక ఆమె ఏమి చెయ్యాలన్నా చేస్తుంది !

నాన్నగారు మాగన్ను నిద్రనుండి కళ్ళు తెరచి తన బాల్య స్నేహితుడు, తనకోసం ప్రాణాలర్పించడానికి సిద్ధంగా ఉన్న ప్రాణస్నేహిడైన రామారావుగారిని దగ్గరకు రమ్మనట్లుగా చూచారు. ఆ చూపు గ్రహించి రామారావుగారు నాన్న ప్రక్కన కూర్చున్నారు. మాట్లాడలేక నా చేతినీ, నీ చేతినీ అతని చేతిలో పెట్టి అమ్మను చూపిస్తూ కన్ను మూసారు. ఆ మూయడం మళ్ళీ తెరవలేదు. అమ్మ నాన్నగారి వియోగం భరించలేక నాన్నను చూడ్డానికి అదే త్రోవన పోయింది. నిన్నూ నన్నూ లెఖ్ఖ చేయకుండా వదలి వెళ్ళిపోయింది. ఇంక మనల్ని పోషించే భారం ఆయన పైన పడ్డది.

రామారావుగారి కొక్క కూతురు. చాలా మంచిపిల్ల పేరు లక్ష్మి. ఇప్పుడు వివాహం కాబోయేది ఆ అమ్మాయికే నేను స్కూలు ఫైనలు పాసయిన తరువాత నన్ను 'ఇంటరు'లో ప్రవేశ పెట్టారు. నీవు మూడవ ఫారం చదువుతున్నావు. నిన్ను 'కాన్ వెంట్'లో చేర్పించారు. అందుచేత నీకు రామారావుగారంత పరిచయంలేదు. తన బాల్యస్నేహితుని కోరిక గనుక నన్ను రామారావుగారు తన సొంత డబ్బుతో 'ఎమ్. బి., బి. ఎస్.' చదివించారు. నాకు ఇక్కడ ఉద్యోగం అవడానికి కారణం కూడా ఆయనే. ఇది తమ్ముడూ కథ— ఇది నీకథా నాకథా మన ఆత్మకథ !" అంటూ శశి ముగించింది.

సుధాకర్ దిగులు ముఖంతో ఏవేవో ఆలోచిస్తున్నాడు. అతని కనుకొలకుల్లో నిలచిన నీరు తళ తళ లాడుతున్నది.

శశి నాలుక కొరుక్కున్నది. ఇంత కథ చెప్పి వాడి పసిమనస్సు నొప్పించడ మేమిటి?— చప్పున తమ్ముడివీపు నిమురుతూ "మరి మనం పెళ్ళికి పోవద్దూ ఆయన రమ్మని వ్రాశారుగా ! ప్రయాణ సన్నాహాలేం చేద్దా మంటావ్" అన్నాను.

సుధాకర్ మాట్లాడలేదు. "ఏరా ! పెళ్ళిని గురించి ఆలోచిస్తున్నావా?— పద ! రామారావుగారితో చెప్పి నీకు కూడా ఒక పిల్లను ముడిపెట్టిస్తాను !" అన్నది. దాంతో అక్క ముఖం చూచి జీవంలేని చిరునవ్వు నవ్వుతూ అక్కడ నుండి ఇంట్లోకి కదిలాడు సుధాకర్.

★

---

## స మా ధా న ం

(28-వ పేజీ తరువాయి)

తీర్చుకున్నాడు. నేను సృష్టించిన రీటాలు క్షేమంగా ఉన్నాయా? పోనీలే రీటా ! నువ్వు నాదగ్గరున్నావు. నాకింక ఏకుంచ, కలం అక్కర్లేదు." అని అనేవాడు.

నన్నత నెంతగానో గౌరవించేవాడు. నే నతనికోసం ఎంతో పాటుపడుతున్నానని అంటాడు. నా హృదయాన్నెరుగున్న మధుకంటె నన్నెవరు ఎక్కువగా ప్రేమిస్తారు. అటువంటి నా మధుకి భార్యగా ఉండటంకంటె నాకేమికావాలి.

అతను సృష్టించిన చిత్రాలన్నీ గోడలమీదనుంచి అతన్ని దీనంగా చూస్తూంటాయి. కుంచెలు తమ సానుభూతిని వెలిబరుస్తూ ఉంటాయి. సితారు పుచ్చుకొని నిర్విచారంగా పాడుకుంటూంటాడు. రీటాలన్నీ కళ్ళు కదపకుండా వింటూంటాయి. స్వర్గంలోకూడా అతని రీటా వింటూ ఉంటుందనుకుంటాను.

కళ్ళు పోయినంత మాత్రంలో మానవులు గ్రుడ్డివాళ్లు కారు. ఉత్తరాన్ని ఒక కథలా చదివి చించెయ్యి.

నీకు ఎప్పుడూ ప్రశాంత వాతావరణంలోనే సమాధానాలు వ్రాస్తూంటాను. నా భర్త కూడా నాతోనే ఉంటారు. మా నిత్య జీవితంలో ఈ సముద్రతీరం దగ్గర కొన్ని గంటలు వ్యయం చెయ్యడం మాకు అలవాటైపోయింది.

శ ల భ.